క్లుప్తంగా

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చర్చించండి



పిడుగురాళ్ల: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలంటూ గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డికి భవన నిర్మాణ కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం గురించి అసెంబ్లీలో చర్చించాలని, దాని కోసం మీరు కృషి చేయాలని తెలియజేశారు. కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి తెలియజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అవ్వారు ప్రసాదరావు, సిలార్ మసూద్, సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివసరావు, కృష్ణానాయక్, శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కోట సాయికుమార్ తదితరులు ఉన్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి



దాచేపల్లి : విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని ఎంఈవో పినాకపాణి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ మెయిన్ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందని, విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని ఎంఈవో ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలకు సక్రమంగా హాజరుకాని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈవో వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆయుష్మాన్ భవ సద్వినియోగం చేసుకోండి

మాచర్ల: ప్రతి పౌరుడి ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపట్టిన ఆయుష్మాన్ భవ ప్రత్యేక ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వాసుపత్రుల వర్కింగ్ చైర్మన్ డాక్టర్ రామకోటయ్య, మాచర్ల ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఉదయభాను సూచించారు. గురువారం ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యమేళా శిబిరాన్ని ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ, ప్రసవ, చిన్న పిల్లల వైద్యులు శస్త్రచికిత్స, చెవి, ముక్కు, గొంతు ఆరోగ్యానికి సంబంధించిన వైద్యులు 400ల మందిని పరిశీలించి చికిత్స చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల స్పెషలిస్టు వైద్యులతో పాటు డాక్టర్ జయప్రకాష్, జ్యోతి, దినేష్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం

మాచర్ల: పట్టణంలోని సొసైటీ కాలనీలో వేంచేసియున్న శ్రీ సత్యసాయి దేవాలయ ఆధ్వర్యంలో ట్రస్టు సభ్యులు గురువారం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, వైద్య సిబ్బంది 200 మందికి, అదే విధంగా దేవాలయ ప్రాంగణంలో వందలాది మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి విద్యాలయ, దేవాలయ నిర్వాహకులు జక్కా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ట్రస్టు సభ్యులు మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతి రోగిని పలకరించి అన్నదాన కార్యక్రమాన్ని జరిపారు. అదే విధంగా దేవాలయ సమీపంలోని వైద్య కేంద్రంలో డాక్టర్ లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో పలువురు పేదలకు ఉచిత వైద్యాన్ని అందించారు. ఉచితంగా మందులు అందించారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

మాచవరం: మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో వినాయక చవితి పురస్కరించుకొని గణేష్ విగ్రహం ఊరేగింపులో డీజే పాటల వివాదంలో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఓ సామాజిక వర్గం వారు తమ సామాజిక వర్గానికి చెందిన పాటలతో ఊరేగింపుగా రావడంతో, తమ ఏరియాలో ఇలాంటి పాటలు వద్దని వారించడంతో ఇరు వర్గాల మధ్య వివాదం తలెత్తి, ఘర్షణకు దారి తీసింది. ఇరు వర్గాలు రాళ్లు రువ్వుకున్నారు. ఎస్ఐ సమీర్‌బాషా పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు.

కోర్కెల సాధన యూటీఎఫ్‌కే సాధ్యం

అచ్చంపేట: న్యాయమైన కోర్కెల సాధన యూటీఎఫ్(ఐక్య ఉపాధ్యాయ సంఘం)కే సాధ్యపడుతుందని, ఉపాధ్యాయులంతా సంఘంలో సభ్యత్వం పొందాలని ఆ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని మాదిపాడు, చల్లగరిగ, తాడువాయి, చెరుకుంపాలెం, కొత్తపల్లి గ్రామాలలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

కోలాహలంగా గణేష్ నిమజ్జనం



వినాయక నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న పీవీఆర్



కారెంపూడిలో గణేష్ ఉత్సవ ఊరేగింపు

రెంటచింతల: వినాయక చవితి సందర్భంగా స్థానిక రెంటాల ఆటో సెంటర్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం వద్ద గురువారం గురుస్వామి బొద్దూరి బ్రహ్మారెడ్డి నేతృత్వంలో పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఆర్ మాట్లాడుతూ విఘ్నాలు తొలగించి విజయాలను అందించే మహాగణపతి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ముందుగా ఇక్కడ ఏర్పాటు చేసిన లడ్డు బహిరంగ వేలంపాటలో వైఎస్సార్ సీపీ నాయకులు గానుగపంట శ్రీనివాసరెడ్డి రూ.55 వేలకు దక్కించుకున్నారు. అనంతరం స్వామివారి నిమజ్జన యాత్రలో పీవీఆర్ పాల్గొన్నారు. మండలపార్టీ అధ్యక్షులు పూజల రామయ్య, పల్నాడు జిల్లా జేసీఎస్ కో ఆర్డినేటర్ మోర్తల ఉమా మహేశ్వర్‌రెడ్డి, పార్టీ నాయకులు కట్టమూరి శ్రీనివాస శంకర్‌రావు నేతృత్వంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు బాణసంచా కాలుస్తూ మేళతాళాలతో గ్రామ వీధులలో నిమజ్జన యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి అమ్మవారి దేవస్థానం చైర్మన్ కట్టమూరి నాగేశ్వరరావు, పార్టీ నేతలు పమ్మి సీతారామిరెడ్డి, శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ యేలూరి సత్యం, ఇగుటూరి మల్లారెడ్డి, గూలి వెంకటరెడ్డి, బొంకూరి తిరుపతిరావు, గుండా కిశోర్, బూసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి మండలంలో ఆనందోత్సాహాలతో..

వెల్దుర్తి: మండలంలోని కండ్లకుంట, గొట్టిపాళ్ళ గ్రామాలలో వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జన కార్యక్రమంలో మూడు జిల్లాల వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీఆర్ కండ్లకుంట గ్రామంలో యాదవ, ముదిరాజ్ సామాజిక వర్గాల వారు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద కొబ్బరికాయ కొట్టి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గొట్టిపాళ్ళలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి కొబ్బరికాయ కొట్టి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాలలో వినాయక చవితి ఘనంగా జరుపుకున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని కులమతాలకతీతంగా గ్రామస్థులంతా జరుపుకోవటం సంతోషకరమన్నారు. గ్రామాలలో సంప్రదాయంగా పురుషులు, మహిళలు, పిల్లలు ఆనందోత్సాహాల మధ్య టపాసులు కాలుస్తూ, గులాంలు చల్లుకుంటూ సంతోషంగా సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం కండ్లకుంట సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మోదుగుల వెంకటరెడ్డి, పోలకం వెంకటనారాయణ, వెంకటలక్ష్మారెడ్డి, తంగిరాల శివారెడ్డి, ఈడెబోయిన వెంకయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు. భక్తులకు పులిహోర పంపిణీ చేశారు.

విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లోని పర్యాటకశాఖకు చెందిన హరితా రిసార్ట్స్‌లో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని గురువారం కోలాహలంగా కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ముందుగా అర్చకులు దత్తు ఆధ్వర్యంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం హరితా రిసార్ట్స్ మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేలం పాటలో వినాయక లడ్డును పర్యాటకశాఖ ఉద్యోగి సభావత్ సోమ్లానాయక్ రూ.12,600 దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో లాంచీయూనిట్ మేనేజర్ వినయతుల్లా, కంట్రోల్ రూమ్ మేనేజర్ స్వామి, ఎత్తిపోతల మేనేజర్ యల్లాల బ్రహ్మం, పులుసు వీరారెడ్డి, మస్తాన్‌రావు, మధు, రామారావు, ఉప్పుతోళ్ళ అశోక్ హనుమానాయక్, బండి కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనం

దాచేపల్లి : మండల వ్యాప్తంగా వినాయకుడి విగ్రహాల నిమజ్జన కార్యక్రమం గురువారం జరిగింది. దాచేపల్లితో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరణ చేసిన వాహనాల్లో విగ్రహాలను కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా యువకులు నృత్యాలు చేసి సందడి చేశారు. దాచేపల్లిలోని పెస్టిసైడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద లడ్డూను తక్కెళ్లపాడు వైఎస్సార్ సీపీ కన్వీనర్ మేడతి నరసింహారావు రూ.14 వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగుబండి గురువులు, అసోసియేషన్ సభ్యులు చిట్టిప్రోలు అమరలింగేశ్వరరావు, రాచమడుగు ప్రసాద్, పసుమర్తి శ్రీనివాసరావు, రామిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసరావు, అక్కినపల్లి బాలయ్య, మేడతి సుబ్బారావు పాల్గొన్నారు.

కారెంపూడిలో వైభవంగా గణేష్ ఊరేగింపులు

కారెంపూడి: కారెంపూడిలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులు గురువారం సాయంత్రం వైభవంగా జరిగాయి. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జనం కోలాహలంగా సాగింది. విచిత్ర వేషధారణలు యువకుల విన్యాసాల మధ్య గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అలాగే స్థానిక ఆటోనగర్ సెంటర్, వడియరాజుల బజారు, శాలివాహన బజారులో ఏర్పాటు చేసిన గణేష్ బొమ్మలతో, వినుకొండ రోడ్డులో అలాగే వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు కారెంపూడిలో కనులపండువగా జరిగాయి. అలాగే మండలంలోని వివిధ గ్రామాలలో కూడా గణేష్ నిమజ్జనోత్సవాలు వైభవంగా జరిగాయి.

రూ.1.70 లక్షలు పలికిన గణేష్ లడ్డు

నిమజ్జన గ్రామోత్సవాలకు బయలు దేరే ముందు గణేష్ లడ్డులకు వేలం పాటలు ఉత్సాహంగా నిర్వహించారు. కారెంపూడిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ లడ్డు ధర రూ.1,70,000 పలికింది. వ్యాపారవేత్త మిట్టపల్లి శివరామకృష్ణ వేలంలో దక్కించుకున్నారు. అలాగే కారెంపూడిలో వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద లడ్డులకు వేలం నిర్వహించగా వేలాది రూపాయలకు పలువురు లడ్డూలను దక్కించుకున్నారు.

నిమజ్జనం సందర్భంగా అన్నదానాలు

మాచర్ల: పట్టణంలోని 4వ లైనులో వినాయక చవితి ఉత్సవాల సందడి ముమ్మరంగా కొనసాగింది. ఆయా వార్డులలో 3 రోజుల పూజల అనంతరం నిమజ్జనంలో భాగంగా గురువారం భారీగా ప్రదర్శనలు నిర్వహిస్తూ డీజేలు, కుంకుమ చల్లుతూ వినాయకునికి సంబరాలు జరిపారు. అందులో భాగంగా పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి లక్ష్మారెడ్డి బజారు, బస్టాండ్ ప్రాంతంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద మూడు జిల్లాల వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం స్వర్గీయ లక్ష్మారెడ్డి ఇంటి ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీవీఆర్ పాల్గొన్నారు. గుంటూరు రోడ్డులోని శ్రీ మహాలక్ష్మి కోల్డ్ స్టోరేజి, 8వ వార్డులో, పాత మాచర్లలో రమేష్ ఆధ్వర్యంలో పలు వినాయక విగ్రహాల వద్ద పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. పట్టణంలో వివిధ వార్డులలో గురువారం వినాయక విగ్రహాల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 15వ వార్డుకు చెందిన ఆర్యవైశ్య మహిళలు కోలాట ప్రదర్శనతో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా మహిళలు గులాంలు చల్లుకుంటూ స్వామి వారికి భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఊరేగింపు పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి దాల్ మిల్ యజమానిలు కొత్తమాసు బ్రహ్మారావు, కొత్తమాసు మల్లిఖార్జునరావు నాయకత్వం వహించారు.

దుర్గిలో గణేష్ నిమజ్జనం

దుర్గి: మండల పరిధిలో వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిప వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించి అనంతరం నిమజ్జన కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం పోలేపల్లి గ్రామంలో రెడ్డి యువజన సంఘం ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు పీవీఆర్‌ను శాలువతో సత్కరించారు. ట్రాక్టర్‌పై ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. దుర్గిలో స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘం పెద్దలు ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహం నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పలు గ్రామాల వినాయక విగ్రహాలను బుగ్గవాగులో నిమజ్జనం చేసేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఈ కార్యక్రమాన్ని బాణసంచాలు, డప్పువాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు.



హరితా రిసార్ట్స్‌లో గణేష్ విగ్రహం వద్ద మేనేజర్ శ్రీనివాస్, ఉద్యోగులు



దాచేపల్లిలో లడ్డూ దక్కించుకున్న నరసింహారావు



స్థానిక రెంటాల ఆటో సెంటర్లో ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జనయాత్రలో పాల్గొన్న పీవీఆర్



ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

నరమాలపాడులో స్వచ్ఛతా ర్యాలీ



కారెంపూడి: మండలంలోని నరమాలపాడు గ్రామంలో స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో గురువారం గ్రామస్తులు పాఠశాల విద్యార్థులు స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. మండల కో ఆర్డినేటర్ కూరాకుల సుబ్బారావు మాట్లాడుతూ ఎవరి ఇంటి పరిసరాలను వారు శుభ్రంగా ఉంచుకోవాలని మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని కోరారు. ప్లాస్టిక్ లాంటి వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయవద్దని అసలు వాడకుండా ఉండడానికి ప్రయత్నం చేయాలని ఒక వేళ వాడినా వాటిని వెంటనే కాల్చి వేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి.వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ చేవూరి భవాని, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేతన ఫౌండేషన్ సేవలు అభినందనీయం



మాచర్ల: వెనుకబడిన మాచర్ల నియోజకవర్గంలో ప్రతి దివ్యాంగుడికి కృత్రిమ కాలు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం ఎంతో అభినందనీయమని కేసీపీ సిమెంట్స్ జీఎం వెంకటరమణ అన్నారు. గురువారం పట్టణంలోని కేసీపీ ఫ్యాక్టరీ ఆవరణలోని కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ, రోటరీ క్లబ్ మాచర్ల, కేసీపీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సేవా సంఘాలు ఈ విధంగా 100 మంది దివ్యాంగులను ఆదుకునే విధంగా క్యాంపు ఏర్పాటు చేయటం ఎంతో సంతోషకరమన్నారు. వైద్యులు, రోటేరియన్ డాక్టర్ రామకోటయ్య మాట్లాడుతూ పేదలకు చేయూతనిచ్చే విధంగా చేతన ఫౌండేషన్ ట్రస్టు, రోటరీ, వాసవి క్లబ్‌ల ఆధ్వర్యంలో ప్రతి దివ్యాంగుడికి కృత్రిమ కాలు ఏర్పాటుకు శిబిరాలు నిర్వహించటం ఆనందకరమన్నారు. రాబోయే రోజుల్లోనూ వారికి చేయూతనందిస్తానన్నారు. కేసీపీ ప్రతినిధులు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, వాసవి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి నాగేశ్వరరావు, జోన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, చుండూరు సత్యనారాయణ, బచ్చు రాజేకుమార్, చిన్ని సత్యనారాయణ, పందిరి నరసింహారావు, ముప్పవరపు నాగార్జున, కేసీపీ వాసు, చందోలు నాగేశ్వరరావు, షేక్ నాగుల్ మీరా, శంకర్, చేతన ఫౌండేషన్ సభ్యులు ఎన్ఆర్ఐ చైర్మన్ వెనిగండ్ల రవికుమార్, అనిల్‌కుమార్, రంగారావు, సీతారామయ్య, సాంబశివరావు, వైద్యులు, సిబ్బంది తదితరులున్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు ఎనలేని ప్రజాదరణ



అభివృద్ధి- సంక్షేమంపై పోస్టర్లను విడుదల చేస్తున్న కొమ్మినేని శ్రీనివాసరావు

ఏపీ సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

గురజాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాదరణ పొందిన నాయకుడని ఏపీ సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి-వాస్తవాలు-వక్రీకరణ రాష్ట్ర సదస్సు స్వచ్ఛ పాలిటిక్స్ వ్యవస్థాపకుడు షేక్ బడే జానీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. ఏపీ ఎన్ఆర్టీ సొసైటీ చైర్మన్ వెంకట్ మేడపాటి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్య సేవలు, ప్రతి పిల్లవాడికి కార్పొరేట్ స్థాయిలో విద్యనందించాలనే లక్ష్యంతో పాలన సాగిస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో 99 శాతం మంది ప్రజలు సంతోషంగా ఉన్నారని, 16 శాతం స్థూల ఉత్పత్తి రేటు పెరిగిందని తెలిపారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందజలో ఉందని చెప్పారు. 2014-19 హయాంలో ఐటీ రంగంలో అభివృద్ధి శూన్యమని చెప్పారు. 2019-23 మధ్య ఐటీ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. పారిశ్రామికంగా 14 శాతం, వ్యవసాయం 12 శాతం వృద్ధి రేటు పెరిగిందని చెప్పారు. ఫోరం ఫర్ బెటర్ సొసైటీ కన్వీనర్ మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సుస్థిరాభివృద్ధి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి మందికి 45 మంది నిరుద్యోగులుంటే ప్రస్తుతం 33 మందికి చేరిందని, పట్టణ ప్రాంతంలో 73 మంది నిరుద్యోగులుంటే వారి సంఖ్య ప్రస్తుతం 60కి చేరిందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), న్యాయవాది కత్తి చలమరాజు, చల్లా రామిరెడ్డి, కుక్కమూడి అనిల్ కుమార్, షేక్ నాగులుమీరా మాట్లాడారు.

వేగంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

పిడుగురాళ్ల: పట్టణంలోని 33వ వార్డులోని 17 సచివాలయాల పరిధిలో ప్రతి ఇంటికి ఆరోగ్య సురక్ష హెల్త్ సర్వే వేగవంతంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలో ఇప్పటికే ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు , వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి వారి ఆరోగ్యంపై సర్వే నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 30వ తేదీ నుంచి అక్టోబర్ 30 వరకు ఆయా సచివాయాల పరిధిలో హెల్త్ క్యాంప్‌లు నిర్వహించటం జరుగుతుందని వైద్య సిబ్బంది వారికి తెలియజేస్తున్నారని వైద్యాధికారులు తెలియజేశారు. అంతేకాకుండా నెలాఖరు వరకు రెండు సార్లు సర్వే చేయటం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల సత్తా

సత్తెనపల్లి: క్రమం తప్పకుండా తర్ఫీదు పొందుతూ రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో సత్తా చాటాలని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జువ్వా మాధవీలత అన్నారు. చెరుజమ్ములపాలెంలో ఈనెల 20న నిర్వహించిన ఎస్‌జీఎఫ్ గుంటూరు, పల్నాడు జిల్లాల స్థాయి హాకీ అండర్-14 విభాగంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు దరువూరి హరిప్రియ, శెగ్గం అక్షయ, కిష్టపాటి దుర్గా రూపశ్రీ, అండర్ -17లో అంక్కెం మాధురి, షేక్ జస్మాపర్వీన్, మల్లా శ్రీలక్ష్మీ మహేశ్వరి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో గురువారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పె అవగాహన సదస్సు

పిడుగురాళ్లరూరల్: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పథకం ద్వారా గ్రామాలు ఆదర్శంగా తీర్చిదిద్దబడతాయని మండల కో ఆర్డినేటర్ ఇనుముక్కల పిచ్చయ్య అన్నారు. మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023 పథకంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలన్నారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ, రోడ్లపై మురికి కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయకుండా శుభ్రంగా ఉంచటం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, దేవాలయాలు వంటి వాటిల్లో పరిశుభ్రత పరిశీలించారు. అనంతరం పాఠశాల విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సర్పంచి రమాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలి



ఎరువుల దుకాణంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్. శ్రీనివాసరెడ్డి

పిడుగురాళ్లరూరల్: రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, గుత్తికొండ తదితర గ్రామాల్లో ఎరువుల దుకాణాలలో ఆయన తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎరువులు అధిక ధరలకు అమ్మినట్లు అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే ఎరువులు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని ఆయన సూచించారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఈబీ అధికారులు

పిడుగురాళ్ల: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ ఎస్.కొండారెడ్డి తెలిపారు. పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నుంచి దిగుతుండగా పిడుగురాళ్ల మండలం జూలకల్లు గ్రామానికి చెందిన బి.ఫణీంద్ర రెండు కర్రల సంచులు తీసుకొని అనుమానాస్పదంగా కనిపించటంతో తనిఖీలు నిర్వహించామని తెలియజేశారు. ఫణీంద్ర తీసుకొని వచ్చిన సంచుల్లో 750 మిల్లీ లీటర్లు మాన్సనోస్ సీసాలు 36, 375 మిల్లీ లీటర్ల మాన్సనోస్ సీసాలు 18 తెలంగాణ నుంచి తీసుకొని వస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకోవటం జరిగిందని తెలిపారు. అనంతరం ఫణీంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, ఎస్ఈబీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు ఈ క్రాప్ బుకింగ్



ఆర్‌బీకేలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ యలమందారెడ్డి

కారెంపూడి: ఈ నెలాఖరు లోపు ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని అలాగే వైఎస్సార్, పీఎం కిసాన్ లబ్ధిదారులైన రైతుల ఈకేవైసీలు కూడా పూర్తి చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారి బి.యలమందారెడ్డి మండలంలోని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని చినగార్లపాడు గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని ఏఓ గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఈకేవైసీ నమోదు 22 శాతం మాత్రమే చేశారని మిగిలింది త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే 80 శాతం ఈ క్రాప్ బుకింగ్ పూర్తయ్యిందని మిగతా 20 శాతం కూడా పూర్తి చేయాలని కోరారు. పంట నష్టం జరిగినప్పుడు ఇన్సూరెన్స్ వర్తించడానికి అలాగే పంటలను గిట్టుబాటు ధరకు ప్రభుత్వానికి అమ్ముకోవాలన్నా ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరని ప్రతి రైతు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.